జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక



చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com



ఆదివారం | 1-2-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 579 పేజీలు: 4 వెల : రూ.7


# ఒకటొచ్చిందంటే..

- సంక్షేమానికి సంకేతం పింఛన్లు
- జిల్లాలో రూ.700 కోట్లతో మౌలిక సదుపాయాల అభివృద్ధి
-మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
-కోటబొమ్మాళిలో విస్తృత పర్యటన



# పేదలకు పండగే..!

**కోటబొమ్మాళి, జనవరి 31(వార్త):** కోటబొమ్మాళి మండలంలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శనివారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరిపారు. లఖందిద్దిలో పెన్షన్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీ పేద ప్రజలకు పండుగలా మారిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో పెన్షన్లను లబ్ధిదారులకు అందిస్తూ, సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు రూ.700 కోట్లతో మౌలిక సదుపాయాల అభివృద్ధి చేపట్టామని, రైతులకు సాగునీరు అందించేందుకు వంశధార రిజర్వాయర్ పనులకు రూ.16.50 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. రైతులకు రాజముద్రతో పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని, సూపర్-6 హామీలన్నింటినీ 20 నెలల వ్యవధిలోనే నెరవేర్చామని పేర్కొన్నారు.

అర్హులైన వారికి నూతన పెన్షన్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ సహకారం, ముఖ్య మంత్రి చంద్రబాబు సమర్థ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతోందన్నారు. వచ్చే నెలలో అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేసి రైతుల ఖాతాల్లో జమ చేస్తామని వెల్లడించారు. తొలుత పలు అంతర్గత రహదారులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించగా, లఖందిద్దిలో రక్షిత మంచినీటి సరఫరా పథకాన్ని ప్రారంభించారు.

## సాగునీటి రంగాన్ని విస్మరించిన వైసీపీ

గత ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో సాగునీటి రంగాన్ని పూర్తిగా విస్మరించిందని మంత్రి తీవ్రంగా విమర్శించారు. ఆ కాలంలో రాష్ట్రంలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా చేపట్టలేదని, గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పించలేదన్నారు. సర్వే రాళ్లపై బొమ్మలు వేసి వందల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. 20 నెలల్లో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని చూసి గత పాలకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. భూముల రీ-సర్వే పేరుతో రెవెన్యూ వ్యవస్థను అస్తవ్యస్తం చేశారని, రైతులకు ఐదేళ్ల పాటు సాగునీరు అందించలేదన్నారు. రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

## ప్రతి ఇంటికీ తాగునీరు

నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ తాగునీరు అందించేందుకు ప్రభుత్వం రూ.600 కోట్లు మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. వాటర్ ట్యాంకులు నిర్మించి, కుళాయిల ద్వారా నీటి సంఫరా చేస్తామని చెప్పారు. 2014-19మధ్యకాలంలో తాను చేపట్టిన అభివృద్ధి పనులు తప్ప గత ఐదేళ్లలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా జరగలేదన్నారు. గ్రామీణ రహదారుల అభి, వృద్ధి లేక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు.

## అన్న క్యాంటీన్ సందర్శన ..

కోటబొమ్మాళిలోని అన్న క్యాంటీన్‌ను మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సందర్శించారు. క్యాంటీన్‌లో అందుతున్న భోజన నాణ్యత, నిర్వహణ తీరును పరిశీలించారు. భోజనం చేస్తున్న ప్రజలతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. పేదలకు అన్న క్యాంటీన్ ఎంతో ఉపయోగకరమన్నారు.

## రైతులకు వ్యవసాయ పరికరాల పంపిణీ

రైతులకు అవసరమైన గాబుతీసే వ్యవసాయ పరికరాలను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆధునిక వ్యవసాయ పరికరాల వినియోగంతో ఖర్చులు తగ్గి దిగుబడులు పెరుగుతాయని తెలిపారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని పేర్కొంటూ, వ్యవసాయ రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించుకోవాలని రైతులకు సూచించారు.

---

వాసుదేవుని బ్రహ్మోత్సవాలకు

# పకడ్బందీ ఏర్పాట్లు





**మందస, జనవరి 31(వార్త):** శ్రీవాసుదేవ పెరుమాళ్ 17వ బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల ఏడు నుంచి 13వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు మందసలో జరుగనున్నాయి. ఈ ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు పోలీసు శాఖ సన్నాహాలు చేస్తోంది. కాశీబుగ్గరూరల్ సీఐ పి.తిరుపతిరావు ఆధ్వర్యంలో మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ ఆలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. శ్రీవాసుదేవ సేవా సమితి ఆలయ కమిటీతో జరిగిన ఈ సమావేశంలో బ్రహ్మోత్సవాల ప్రత్యేకత, క్యూలైన్, అన్నదానం, కల్యాణం.. ఏయే రోజున జరుగుతాయి, భక్తుల రద్దీ ఎప్పుడు ఉంటుందని అడిగి తెలుసుకున్నారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు పోలీసులు తగిన చర్యలు తీసుకుంటున్నట్టు సీఐ తిరుపతిరావు చెప్పారు. భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామని, ఆలయ అభివృద్ధి కమిటీ సహకరించాలని కోరారు. మందసలో ట్రాఫిక్ నియంత్రణకు కూడా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో అర్చకులు సచ్చిదానందపాడి, అనిల్‌కుమార్‌స్వామి, జామి ప్రసాదరావు, దేవరశెట్టి మార్కండేయులు, కరతల తిరుపతిరావు, కిల్లంశెట్టి నాగేశ్వరరావు, దుంకురు తిరుపతిరావు తదిత రులు పాల్గొన్నారు.

---




మధ్యవర్తిత్వంతో..

# కేసులకు మోక్షం

-జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

**శ్రీకాకుళం, జనవరి 31:** కోర్టుల్లో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసులను మధ్యవర్తిత్వం ద్వారా సత్వరమే పరిష్కరించుకోవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. ఎంపిక చేసిన న్యాయవాదులకు ఐదు రోజులుగా నిర్వహిస్తున్న 40గంటల ప్రత్యేక శిక్షణా తరగతులు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధ్యవర్తిత్వ ప్రక్రియలో మెలకువలు నేర్చుకోవడంతో న్యాయవాదులకే కాకుండా, కక్షిదారులకు కూడా ఎంతో మేలు జరుగుతుందన్నారు. శిక్షణ పొందిన న్యాయవాదులు ఈ ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని, ఉభయ పక్షాల అంగీకారంతో కేసులను పరిష్కరించి ప్రజలకు భారం తగ్గించాలని సూచించారు. ఈ శిక్షణలో సీనియర్ ట్రైనర్లు వి.పి.తనకచన్, పి.జి. సురేష్‌లు పాల్గొని మధ్యవర్తిత్వంలోని న్యాయపరమైన చిక్కులు, వాటిని పరిష్కరించే విధానాలపై న్యాయవాదులకు విస్తృత అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

---

వైసీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శిగా

# ఎంఏ రఫీ



**శ్రీకాకుళం టౌన్, జనవరి 31(వార్త):** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎం.ఏ.రఫీకి ఆ పార్టీ అధిష్టానం సముచిత స్థానం కల్పించింది. ఆయనను రాష్ట్ర మైనార్టీ సెల్ విభాగం కార్యదర్శిగా నియమించింది. అధినేత వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం వైకాపా మైనార్టీ సెల్ విభాగం కార్యవర్గాన్ని నియమించగా రఫీకి ఈ పదవిని కట్టబెట్టింది. ఆయన మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు ముఖ్య అనుచర గణంలో ఆయన ఒక్కరుగా ఉన్నారు. శ్రీకాకుళం మున్సిపల్ కౌన్సిలర్‌గా పనిచేశారు. జిల్లాలో మైనార్టీ సంఘం నాయకుడిగా తన కంటూ ప్రత్యేక గుర్తింపు పొందారు. జామియా మసీదు అభివృద్ధి కోసం, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కోసం పనిచేశారు. ఆయనకు పదవి లభించడంపై ఆ పార్టీ నాయకులతో పాటు ముస్లిం పెద్దలు, మిత్రులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారు. ప్రత్యేక అభినందనలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచిన అధినేత జగన్, జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావుతో పాటు ఇతర పార్టీ పెద్దలకి రఫీ కృతజ్ఞతలు తెలిపారు.

---

# సిట్ చెప్పినా ..దుష్ప్రచారమా?

- -కూటమి నేతలు లెంపలేసుకోవాలి
- -మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు
- -పలాసలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు



**పలాస, జనవరి 31 (వార్త):** తిరుమల లడ్డులో వినియోగించిన నెయ్యి జంతువుల కొవ్వుతో కల్తీ జరిగిందని, వైసీపీ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేసిన కూటమి ప్రభుత్వ ముఖ్యనేతల వక్రబుద్ధి మారాలని కోరుతూ వైసీపీ పలాస నియోజకవర్గ పార్టీ నేతలు, కార్యకర్తలు ఉదయపురంలో గల వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం కొబ్బరికాయలు కొట్టారు. రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో నియోజవర్గ నలుమూలల నుంచి విచ్చేసిన వైసీపీ శ్రేణులతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని 140 కోట్ల భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా తిరుమల దేవస్థానం, లడ్డూపై విషప్రచారం చేసిన చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, లోకేష్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు సీబీఐ ఆధ్వర్యంలో వేసిన సిట్ విచారణలో నిజం నిగ్గు తేలిన తర్వాత చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కుట్ర బుద్ధి తెలిసిందన్నారు. సిట్ నిజాలు తేల్చిన తర్వాత కూడా సిగ్గు లేకుండా బొంకుతున్న కూటమి నేతల వైఖరిని దుయ్యబట్టారు. తొలుత డాక్టర్ అప్పలరాజుతోపాటు వైసీపీ నేతలు, కార్యకర్తలు స్థానిక వెంకటేశ్వర స్వామి దేవాలయం చుట్టూ ప్రదర్శనలు చేశారు. ప్రత్యేక పూజలు చేసి, కొబ్బరికాయలు కొట్టారు. ఇప్పటికైనా కూటమి నేతల బుద్ధి మారాలని, 'గోవిందా' 'గోవిందా' అంటూ నినదించారు. అనంతరం విలేఖరులతో డాక్టర్ అప్పలరాజు మాట్లాడుతూ పంది కొవ్వు, జంతువుల కొవ్వు కలిసిందంటూ తిరుమల లడ్డూ ప్రసాదాన్ని అవమానం పాలు చేశారని ఆయన మండిపడ్డారు. లడ్డూలో ఎటువంటి కొవ్వు కలవలేదని సుప్రీంకోర్టుకు సిట్ నివేదిక ఇచ్చిందని, దీనిపై కూటమి నేతలు ఏం సమాధానం చెబుతారని ఆయన ప్రశ్నించారు. టీటీడీ చైర్మన్‌కి.. భారత సుప్రీంకోర్టు, న్యాయ వ్యవస్థపై నమ్మకం లేనట్టు కనిపిస్తోందని, ఇలాంటి వారికి అంతర్జాతీయ న్యాయస్థానం సమాధానం చెప్పలేమోనని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఏ రకంగా ప్రాయశ్చిత్తం చేసుకుంటారని ప్రశ్నించారు. భక్తుల మనోభావాలు దెబ్బతినేలా విష ప్రచారం చేసిన కూటమి నేతలను భగవంతుడు క్షమించడని స్పష్టం చేశారు. చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయలేమన్న భయంతో లడ్డు ప్రసాదంలో కల్తీ జరిగిందంటూ ప్రచారం చేసి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందడుగు వేసిన మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని, ప్రజల నుంచి దూరం చేసేందుకు చంద్రబాబు అండ్ కో ఇటు వంటి నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వం లౌకికవాదానికి కట్టుబడి ఎల్లప్పుడూ హిందూ సంప్రదాయాలు, దేవాలయాల పవిత్రతను కాపాడే లక్ష్యంగానే పని చేసిందన్నారు. ఇకనైనా సీఎం చంద్రబాబు బాధ్యతా రాహిత్యంగా మాట్లాడడం మానుకొని, ప్రజలకు నిజాలు చెప్పాలని కోరారు. సూదికొండ, జగన్నాథ సాగరం వంటి ప్రాంతాల్లో కలెక్టర్‌తోపాటు..ఎమ్మెల్యే గౌతు శిరీష తన వెంట భూ ఆక్రమణ, కబ్జాదారులను తీసుకువెళ్లి, ఎక్కడ కబ్జా జరిగిందో వైసీపీ సమాధానం చెప్పాలని ప్రశ్నించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నల్లబొడ్లూరులో ప్రజా వేదిక వైసీపీ నిర్వహిస్తుందని, శిరీషను సాదరంగా ఆహ్వానిస్తున్నామని, అందుకు టీడీపీ సిద్ధమా? అంటూ డాక్టర్ అప్పలరాజు సవాల్ విసిరారు. కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకుడు హనుమంతు వెంకట్రావుదొర, మందస ఎంపీపీ డొక్కరి దానయ్యయాదవ్, వైసీపీ పలాస పట్టణ అధ్యక్షుడు శిష్టు గోపి, నాయకులు పి.గురయ్యానాయుడు, మడియా రామకృష్ణ, బమ్మిడి సంతోష్, బల్ల కుమారి, మల్ల సురేష్, నర్తు వెంకటరమణ యాదవ్, దున్న సత్యం, తమ్మినాన శాంతారామ్, గౌరీ త్యాడి, బాడ జగన్నాయకులు, తలగాన హరికృష్ణ యాదవ్, చెరుకుపల్లి ఎల్లమ్మ లక్ష్మణ్ రావు, తూముల సోమేశ్, యాళ్ల సంతోష్, దువ్వాడ రవి, కౌన్సిలర్లు కర్రి మాధవరావు, బెల్లాల శ్రీనివాస్, దువ్వాడ సత్యవాణి, మద్దిలి బాలకృష్ణ యాదవ్, మజ్జి హేమరాజ్ తదితరులు పాల్గొన్నారు.

---

# శభాష్ ...బషీర్!

**-చోరీ జరిగిన ఆరు రోజుల్లోనే 6.4 తులాల బంగారం రికవరీ**

**- క్రైమ్ కానిస్టేబుల్ ను అభినందించిన సీఐ**

**ఇచ్ఛాపురం, జనవరి 31(వార్త):** చోరీకి గురైన 6.4తులాల బంగారాన్ని ఆరు రోజుల్లోనే రికవరీ చేసిన క్రైమ్ కానిస్టేబుల్ ఎండీ బషీర్‌ను సీఐ మీసాల చిన్నంనాయుడు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమీన్‌సాహెబ్‌పేటకి చెందిన కదంబాల భాగ్యలక్ష్మి మండపల్లిలో తన కూతురు ఇంటి వద్ద నుంచి ఆమెకు చెందిన సుమారు 6.4 తులాల బంగారు ఆభరణాలు బాక్స్‌లో పెట్టి, హ్యాండ్ బ్యాగ్‌లో వేసుకొని, ఈ నెల 24న ఇచ్ఛాపురం మార్కెట్ వచ్చి, కూరగాయలు కొన్న తరువాత బ్యాగ్ చూసేసరికి, జిప్ తెరచి ఉండి, అందులో ఉన్న బంగారు వస్తువులు ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసిందన్నారు. దీనిపై కేసు నమోదు చేసిన టౌన్ ఎస్ఐ ఎం.ముకుందరావు ఆధ్వర్యంలో కానిస్టేబుల్ బషీర్ రైల్వేస్టేషన్ దగ్గరకు వెళ్లే సరికి ఒడిశా ఆస్కానువాపల్లికి చెందిన పులి సుభా షిణి..అనుమానాస్పద స్థితిలో కనిపించగా ఆమెను మహిళా సిబ్బందితో విచారించగా, తాను దొంగిలించినట్లు అంగీకరించిందన్నారు. ఆమె నుంచి బంగారు ఆభరణాలు మధ్యవర్తుల సమక్షంలో స్వాధీనపరు చుకొని, అరెస్టు చేసినట్లు చెప్పారు.

ఈ కేసులో ప్రతిభ కనబర్చిన క్రైమ్ కానిస్టేబుల్ బషీర్‌ను సీఐ అభినందించారు. ప్రస్తుతం బంగారం ధరలు విపరీ తంగా పెరిగిపోతున్న నేపథ్యంలో దొంగతనాలు అధి కమయ్యే అవకాశాలు ఉన్నాయని, ప్రజలు అప్రమ త్తంగా ఉండాలని కోరారు. ముఖ్యంగా మహిళలు మెడలో బంగారు ఆభరణాలు ధరించే సమయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు.



## అంబటిపై చర్యలు చేపట్టాలి : ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

**పాతపట్నం, జనవరి 31(వార్త):** రాజకీయాల్లో విమర్శలు ఉండాలి కానీ, వయసుకి,పదవికి గౌరవం ఇవ్వలేని స్థాయికి దిగజారిపోకూడదని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని, ఆయన తల్లిని ఉద్దేశించి అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నాయని మండిపడ్డారు. రాజకీయంగా విమర్శించే దమ్ము లేక, కన్నతల్లిని లాగడం మీ అనాగరికతకు పరాకాష్ట అని,రాష్ట్ర ముఖ్యమంత్రిని పట్టుకుని ల కారంతో నోటికొచ్చినట్టు దూషించడమే మీ పార్టీ సంస్కృతిగా మారిపోయిందని ఎద్దేవా చేశారు. మీ వయసు ఎంత? మీరు మాట్లాడే భాష ఏంటి? అసలు మీరు ప్రజా ప్రతినిధిగా పనిచేశారంటే జనం ఆశ్చర్యపోతున్నారని అంబటిని ఎమ్మెల్యే గోవిందరావు ప్రశ్నించారు. రాజకీయం అంటే కేవలం బూతులు మాట్లాడటం,ఎదుటివారి కుటుంబాలను రోడ్డుపైకి లాగడం కాదని,మాజీ మంత్రి హోదాలో ఉండి అబంటి రాంబాబు ఇలాంటి నీచమైన వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని, ప్రజలు అంతా గమనిస్తున్నారని త్వరలోనే మీకు తగిన బుద్ధి చెబుతారని గోవిందరావు అన్నారు.



## 12న జరిగే సమ్మెను జయప్రదం చేయాలి



**మందస, జనవరి 31(వార్త):** దేశవ్యాప్త సమ్మె ఈ నెల 12న నిర్వహిస్తున్నట్టు సీఐటీయు మండల అధ్యక్షుడు పి.దేవేంద్ర అన్నారు. మందసలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపినిచ్చారు. ఈ మేరకు మందస మండల విద్యాశాఖ అధికారి-2 ఎం.భాస్కరరావుకు మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మె నోటీసును అందజేశారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను రద్దు చేయాలని, మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, స్కీం వర్కర్లుగా గుర్తించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు, స్వచ్ఛంద సంస్థలకు అప్పగించరాదని, ప్రస్తుత ధరల పెరుగుదలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రభావతి, వరలక్ష్మి, సుశీల, జె.వరలక్ష్మమ్మ, సవిత తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ ఎన్టీఆర్ భరోసా పెన్షన్



**మందస, జనవరి 31(వార్త):** ప్రభుత్వం సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఫిబ్రవరి ఒకటిన ఆదివారంతో ఒకరోజు ముందుగానే ఇంటింటికీ ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు అందించినట్లు వెలుగు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ మందస అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. ఎలాంటి అవినీతికి తావు లేకుండా ఇంటింటికి వెళ్లి పెన్షన్ పంపిణీ చేసే అధికారులు లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తూ, పెన్షన్ ఉదయాన్నే అందించినట్లు వివరించారు. బిన్నలమదనాపురం, బాలిగాం, రట్టి, అంబుగాం బొడ్లూరు తదితర గ్రామాల్లో పెన్షన్ పంపిణీ విధానాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తపరిచారు. అనంతరం నారాయణపురం గ్రామంలో మహిళా సంఘాలతో ఏర్పాటుచేసిన ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వెలుగు సిబ్బంది రాజారావు, వీఓఏలు కరుణశ్రీ, లోలాక్షి, గుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నారాయణ సేవలు నిరుపమానం



**ఇచ్ఛాపురం, జనవరి 31 (వార్త):** ఇచ్ఛాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మూడు దశాబ్దాలకు పైగా పార్ట్ టైం కంటింజెంట్ ఉద్యోగిగా రూ.6వేల వేతనం నుంచి అటెండర్‌గా సేవలందించిన కె.నారాయణను ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు అభినందించారు. నారాయణ పదవీ విరమణ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. ఎంతో మంది ప్రిన్సిపాల్ లు అధ్యాపకులు విద్యార్థులు కు సేవలందించిన నారాయణ తన జీవిత కాలం మొత్తం పర్మినెంట్ ఉద్యోగం కి నోచుకోలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాళ్లు నిత్యానంద పట్నాయక్, రోబిన్ కుమార్ పాడి, లెక్చరర్‌లు దుర్యోధన, శివకుమార్,సీతమ్మ సంతోష్ కుమార్,లోకేష్ ఈశ్వర రావు మోహన్ రావు రాధ శాంత దేవరాజు బారువా అధ్యాపకులు రామకృష్ణ నాగేశ్వరరావు పల్లి స్నేహ ఈశ్వర రావు, పూర్వ విద్యార్థులు దట్టి ఈశ్వర రావు, నర్తు యాదవ రావు త్రివేణి లోకేష్ వెంకట రమణ దిలీప్ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ



**ఇచ్ఛాపురం, జనవరి 31 (వార్త):** ఎన్టీఆర్ భరోసా కొత్త పింఛన్లు ను 22 వ వార్డు లో కౌన్సిలర్ కాళ్ల దిలీప్ యాదవ్ పంపిణీ చేశారు. టంకాల రమాదేవి నర్తు మహాలక్ష్మి లకు స్పౌజ్ పింఛన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణ కుమారి స్వాతి తదితరులు పాల్గొన్నారు. కేశుపురం, నీలాపుపుట్టుగలో దక్కత కామేశ్వరరావు( ఎపి రాష్ట్ర ప్రభుత్వ నాటక అకాడమీ డైరెక్టర్), వెల్ఫేర్ అస్టెంట్ గౌతమి, దున్న తారక్, జయరాం, ఈశ్వర రావు, సూరి రామారావు తదితరులు అందజేశారు. బాలకృష్ణాపురం పంచాయతీ, మునిభద్ర, లక్ష్మీపురంలో సర్పంచ్ ప్రతినిధి బోరుబద్ర లోహిదాస్ మాస్టర్, కోట రామా రావు, సెక్రటరీ కిరణ్, మనోజ్, వెంకటరావు, నందిని తదితరులు పాల్గొన్నారు. 15వ వార్డ్ పెన్షన్ పంపిణి కార్యక్రమంలో నందిగం కోటేశ్వరరావు, సరస్వతి, సచివాలయం సిబ్బంది, జీనా, హుస్సేన్ 11వ వార్డులో కౌన్సిలర్ ఆసి లీలారాణి పాల్గొన్నారు.

## బాలకార్మికుల గుర్తింపునకు స్పెషల్ డ్రైవ్

**ఇచ్ఛాపురం, జనవరి 31 (వార్త):** బాల, కౌమార కార్మికుల రక్షణ, పునరావాస డ్రైవ్ 3.0 ప్రత్యేక డ్రైవ్. లైన్ విభాగాలతో బాల, కౌమార కార్మికుల రక్షణ పునరావాస డ్రైవ్ ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో నిర్వహిస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న వివిధ షాపుల్లో తనిఖీ చేసి షాపుల యాజమాన్యాలకు బాలలను పనిలో వుంచరాదని 18 సంవత్సరాల లోపల వ్యక్తులు షాపుల్లో ఉన్నట్లయితే వారిపై చట్టపరమైన చర్యలను షాపు యాజమాన్యాలపై తీసుకుంటామని హెచ్చరించారు. చైల్డ్ లేబర్ యాక్ట్ గురించి వివరించారు. కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ విజయ్‌కుమార్, చైల్డ్ హెల్ప్‌లైన్ సూపర్‌వైజర్ జాస్మిన్‌కుమారి, (బ్రెడ్స్(కేఎస్‌సీఎఫ్) మండల కోఆర్డినేటర్ స్వాతి, పోలీస్, ఎడ్యుకేషన్, సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ ప్రతినిధులు పాల్గొన్నారు.



# అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

### -కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



**పాతపట్నం, జనవరి 31(వార్త):** పాతపట్నంబ నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు.

పాతపట్నం నియోజకవర్గ కేంద్రంలోని కేవీఎం ప్లాజాలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆధ్వర్యంలో నిర్వహించిన శాఖల వారీ సమీక్షా సమావేశానికి ఆయన హాజరయ్యారు.

ఎకనామిక్ విజన్ ప్లాన్ 2047లో భాగంగా ఐదు మండలాల్లో ప్రస్తుతం జరుగుతున్న పనుల పురోగతిని ఈ సందర్భంగా కలెక్టర్ క్షుణ్ణంగా సమీక్షించారు. ముఖ్యంగా ఉద్దానం ఫేజ్-2 జల్ జీవన్ మిషన్ పనులపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. తాగునీటి సరఫరా ప్రాజెక్టులతో పాటు వంశధార రిజర్వాయర్ ఆయకట్టు అభివృద్ధి, బి.ఆర్.ఆర్ బ్యారేజీ బ్రిడ్జి పనులు, ఎత్తిపోతల పథకాలను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయడం ద్వారా రైతులకు సత్వరమే ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అధికారులకు సూచించారు.

ఆర్.డబ్ల్యూ.ఎస్, పంచాయతీ రాజ్, రోడ్లు-భవనాలు, విద్యాశాఖ, విద్యుత్ శాఖల వారీగా పనుల వివరాలను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ డి.సత్యనారాయణ, ఆర్డీఓ కృష్ణమూర్తి, వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ప్రజలపై నిబద్ధత చాటుకున్న ప్రభుత్వం

### -ఎమ్మెల్యే గౌతు శిరీష -బహడపల్లిలో పెన్షన్ల పంపిణీ



**మందస, జనవరి 31(వార్త):** రాష్ట్రంలోని పెన్షన్ లబ్ధిదారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పలాస నియోజకవర్గ ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మందస మండలంలోని బహడపల్లిలో పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిబ్రవరి 1న ఆదివారం సెలవు దినం కావడంతో, లబ్ధిదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఒక రోజు ముందుగానే పెన్షన్లను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ప్రజలకు ఏ చిన్న అసౌకర్యం కలగకూడదన్నదే మా కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ఇచ్చిన మాటకు కట్టుబడి, పారదర్శకమైన పాలన అందిస్తున్నామన్నారు. బహడపల్లి గ్రామంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని, ప్రజల సంక్షేమం పట్ల మా ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి ఉన్న చిత్తశుద్ధికి, నిబద్ధతకు ఈ ముందస్తు పంపిణీ ఒక నిదర్శనమని పేర్కొన్నారు. ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటకే చేర్చడంలో ఎమ్మెల్యే గౌతు శిరీష చూపిస్తున్న చొరవ, నిజాయితీ పట్ల స్థానిక ప్రజలు, లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల-తిరుపతికి అప్రతిష్ట తీసుకువచ్చిన వైకాపా



**మందస, జనవరి 31(వార్త):** తిరుమల తిరుమతి దేవస్థానానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మచ్చ తీసుకువచ్చిందని జనసేన పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి దిలీప్ కుమార్ పాణిగ్రహి అన్నారు. మందసలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ లడ్డూ ప్రసాదం కల్తీ వివాదంలో ప్రతిపక్ష వైసీపీ పార్టీ నేతలు అర్థంలేని వాదనతో జనాలను తప్పుదోవపట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కల్తీ నెయ్యి లేదని సిట్ క్లీన్ చీట్ ఇచ్చినట్లుగా మాట్లాడుతూ సంబరాలు చేసుకుంటున్నారని, సిట్ సంపూర్ణ నివేదికలో ఎక్కడా కూడా లడ్డూ కల్తీ జరగలేదని చెప్పలేదన్నారు. కెమికల్స్, పామాయిల్ వంటి క్యాన్సర్ కారకాలు వాడారని తేల్చిందన్నారు. ఈ దుర్మార్గాన్ని సిట్ తన నివేదికలో స్పష్టంగా చెబితే నీచపు రాజకీయాలు చేస్తున్నారన్నారు. ఈ ఘోరం వైసీపీ హయాంలో జరిగింది అనేది కాదంటారా? ప్రశ్నించారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని, వేంకటేశ్వర స్వామితో ఆటలొద్దని హితవు పలికారు.

## స్వేచ్ఛావతి ఆలయంలో వైసీపీ నాయకుల పూజలు

**ఇచ్ఛాపురం, జనవరి31 (వార్త):** తిరుపతి లడ్డూ పై వివాదం నేపథ్యంలోవైస్సార్సీపీ పార్టీ అధ్యక్షులు వై.యస్.జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఇచ్ఛాపురం నియోజకవర్గం ప్రధాన కేంద్రం నందు దేవాలయం వెలుపల మీడియా ద్వారా వాస్తవాలను ప్రజలకు తెలియజేయడానికి వైస్సార్సీపీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ వైఎస్ఆర్సీపీ సమన్వయకర్త సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి ,పిరియా విజయ ,( జిల్లా పరిషత్, చైర్ పర్సన్) ఎమ్మెల్సీ నర్తు రామారావు , రాష్ట్ర బి.సి విభాగం కార్యదర్శి మరియు సీనియర్ నాయకుడు నర్తు నరేంద్ర యాదవ్ ల ఆధ్వర్యంలో నియోజకవర్గ శ్రేణులు గ్రామ దేవత స్వేచ్ఛావతి అమ్మవారి గుడిలో, ఆ ఆవరణలోనివేంకటేశ్వర స్వామి వారి మందిరంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గం సమన్వయకర్త సాడి శ్యాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ నర్తు రామారావు, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ శ్రీమతి పిరియా విజయ,పార్టీ బి.సి విభాగం రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్, ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్ పర్సన్ పిలక రాజలక్ష్మి, జిల్లా పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు ఉలాల భారతీ దివ్య, కవిటి, ఎం.పి.పి ప్రతినిధి కడియాల ప్రకాశ్,కంచిలి ఎంపిపి పైల దేవదాసు రెడ్డిలు మాట్లాడుతూ విజయవాడ వరదల నేపథ్యంలో ప్రభుత్వం పై వచ్చిన ఆరోపణలను దారి మళ్ళించడానికి ప్రపంచ హిందూ ధార్మిక సంస్థ, కొలిచే భక్తుల కొంగు బంగారంగా పూజలందుకునే శ్రీ వెంకటేశ్వర స్వామి నైవేద్యానికే కుట్ర పూరితంగా అపచారానికి పూనుకున్న కూటమి కుట్రలనుండి జగన్మోహన్ రెడ్డిని, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతల దోషమేమీ లేదని, జంతువుల కొవ్వు, చేప నూనె తిరుపతి లడ్డూలో కల్తీ జరగలేదని సిబిఐ నేతృత్వంలోని సిట్ తన నివేదికలో పేర్కొన్నదని నేతలు తెలియజేసారు. తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డు ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిసిందంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మరియు కూటమి నేతలు చేసిన నీచమైన విష ప్రచారం, పూర్తిగా అసత్యమని సిట్ కోర్టుకు సమర్పించిన చార్జీ షీట్‌లో స్పష్టం చేసారని కోర్టుకు నిజ నిర్ధారణ నివేదిక ఇచ్చినప్పటికీ, కూటమి నేతలు ఇంకా అసత్య ప్రచారాలతో భక్తుల మనోభావాలను గాయపరుస్తున్నారని అన్నారు. దుర్బుద్ధితో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లు చేసిన పాపాలకు నిష్కృతి లేదన్నారు. ఈ కార్యక్రమం లో ఇచ్ఛాపురం నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షుడు నర్తు ప్రేమ్ కుమార్, ఎంపిపి బోర పుష్ప, ఇచ్ఛాపురం, సోంపేట జడ్.పి.టీ.సిలు ఉప్పాడ నారాయణమ్మ, తడక యశోద,జోగారావు, కంచిలి జడ్.పి.టీ.సి ప్రతినిధి ఇప్పిలి కృష్ణారావు, ఇచ్ఛాపురం మండలం, పట్టణ పార్టీ అధ్యక్షులు పాతిర్ల రాజశేఖరరెడ్డి, బలివాడ ప్రకాశరావు పట్నాయక్, మాజీ డిసిఎంఎస్ అధ్యక్షుల ప్రతినిధి సల్ల దేవరాజు, ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట మండలాల వైస్ ఎంపిపిలు, సర్పంచ్ లు, ఎంపిటిసి లు, మాజీ ఎంపిపి కారింగి మోహన్ రావు, మాజీ జడ్.పి.టీ.సి దక్కత నూకయ్య, ఇచ్ఛాపురం మున్సిపాలిటీ కౌన్సిలర్ లు, నియోజకవర్గం ప్రతి గ్రామం నుంచి సీనియర్ నాయకులు, కార్యకర్తలు, వైసిపి సోషల్ మీడియా సైనికులు పాల్గొన్నారు.



## టెక్కలిలో సోమవారం రెవెన్యూ క్లినిక్

### - హాజరు కానున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



**టెక్కలి, జనవరి 31(వార్త):** జిల్లాలోని రెవెన్యూ సంబంధిత సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం చేస్తూ టెక్కలి రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో జిల్లా మొత్తానికి సోమవారం ప్రత్యేక 'రెవెన్యూ క్లినిక్' నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్వయంగా పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించనున్నారు. భూ సమస్యలు, మ్యుటేషన్లు, పట్టాదారు పాసు పుస్తకాలు, భూ సర్వే వంటి దీర్ఘకాలిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారు ఈ క్లినిక్‌ను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి, సత్వర పరిష్కారం చూపేందుకు ఈ వేదిక ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

## పర్స్, డబ్బులు అప్పగింత



**పాతపట్నం, జనవరి 31(వార్త):** స్థానిక రవీంద్రభారతి స్కూల్ సమీపంలో శనివారం ఒడిశా రాష్ట్రం రాణిపేట గ్రామానికి చెందిన బోడు గణపతికి రోడ్డుపై 11,290 రూపాయలుతో వున్న ఒక పర్సు దొరికింది. ఆ పర్సును పాతపట్నం పోలీస్ స్టేషన్ కి ఆయన అప్పగించగా పాతపట్నం ఎస్ఐ కె. మధుసూదనరావు పర్సులోని డ్రైవింగ్ లైసెన్స్ ఆధారంగా అడ్రాస్ కనుక్కొని సదరు పర్సు పోగొట్టుకున్న పాతపట్నం మండలంలోని కొరసవాడ గ్రామం పెద్దవీధికి చెందిన గొలుకొండ సతీష్ గా గుర్తించి సమాచారం అందించారు.సిఐ ఎన్.సన్యాసి నాయుడు సమక్షంలో పర్సును,డబ్బులను సతీష్ కు అందజేశారు.డబ్బులతో కూడిన పర్స్ ను నిజాయితీగా పోలీసులకు అప్పగించిన గణపతికి అభినందనలు వారు తెలియజేశారు.

## పాడి రైతుకు బీమా పరిహారం



**కంచిలి, జనవరి 31(వార్త):** కంచిలి మండలం పెద్ద శ్రీరాంపురం గ్రామానికి చెందిన విశాఖ డైరీ పాడి రైతు తండ్రి పాపయ్య ఆవు మృతి చెందడంతో సంబంధిత డెయిరీ ద్వారా 23 వేల రూపాయల బీమా చెక్కును శనివారం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాదిన రామారావు చేతుల మీదుగా అందజేశారు. దీంతో పాడి రైతు పాపయ్య కుటుంబం హర్షం వ్యక్తం చేసింది. పాడి రైతులకు విశాఖ డైరీ ఎల్లప్పుడూ బాసటగా నిలుస్తుందని రామారావు పేర్కొన్నారు. ప్రతి రైతు విశాఖ డైరీ ద్వారా పాలవిక్రయం చేస్తూ మంచి లాభాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో డైరీ వైద్యుడు పవన్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## స్వీయ విజ్ఞాన ప్రదర్శన

**పలాస, జనవరి 31(వార్త):** రామక్రిష్ణపురములో ఉన్న శ్రీ సత్యసాయి విద్యావిహార్ లో ఎల్‌కెజి నుంచి 5వ తరగతి వరకు గల ప్రైమరీ పిల్లలు వారి వారి స్ృజనాత్మకతను వెలికితీసే స్వీయ విజ్ఞాన ప్రదర్శన అను పేరుతో ప్రత్యేక కార్యక్రమము శనివారం నిర్వహించారు. ఈ ఎగ్జిబిషన్ లో అందరూ పిల్లలు అన్ని సబ్జెక్ట్స్ లలో వారి వారి స్థాయికి మించి ప్రదర్శనలు చేసి అందరిని అబ్బురపరిచరు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సత్యసాయి సేవాసంస్థల శ్రీకాకుళం జిల్లా సేవాదళ్ కో ఆర్డినేటర్ పప్పల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇంత చిన్న వయస్సులో ఇంత మంచి ప్రదర్శన చేయడము ఎంతో అద్భుతమైన విషయమని అన్నారు. స్ృజనాత్మకతను వెలికితీసే స్వీయ-విజ్ఞాన ప్రదర్శనలు విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక ఆలోచనా సామర్థ్యాన్ని, పరిశోధనా దృక్పథాన్ని బయటపెడతాయని తెలిపారు. జిల్లా ఇంచార్జ్ జామి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ యధార్థంగా చెప్పాలంటే ఇంత మంచి స్కూల్ మన ప్రాంతములో శ్రీ సత్యసాయి ట్రస్ట్ వారు నెలకొల్పడం మనందరి అదృష్టమని అన్నారు. విద్యార్థుల్లో కొత్త ఆలోచనలు, పరిష్కారాలు రూపొందించే సామర్థ్యం పెరుగుతుందని, ప్రభుత్వ పాఠశాలల్లో శాస్త్ర ప్రదర్శనలు ద్వారా యువతలో విజ్ఞాన ఆసక్తి పెంచుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ మల్లా రామేశ్వరరావు, ఉప అధ్యక్షులు తాలాసు శ్రీనివాస్, ప్రిన్సిపాల్ ప్రీతి చౌదరి, బాలవికాస్ గురువు త్రివేణి, నాగరాజు, ప్రైమరీ టీచర్లు, అధిక సంఖ్యలో తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## సారవకోటలో పింఛన్ల పంపిణీ చేసిన కలెక్టర్ స్వప్నికల్ దినకర్



**సారవకోట, జనవరి 31 (వార్త):** సారవకోట గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ శ్రీ స్వప్నికల్ దినకర్ పుండ్కర్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు స్వయంగా పింఛన్లు అందజేసి, పథకం అమలుపై అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి సచివాలయం సిబ్బంది లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లను పంపిణీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. లబ్ధిదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారదర్శకంగా పంపిణీ జరిగేలా చూడాలని సూచించారు. అలాగే ఐవీఆర్ఎస్ (xa=ా) కాల్స్ విషయంలో లబ్ధిదారులకు పూర్తి స్థాయి అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీ మోహన్ కుమార్, పంచాయతీ కార్యదర్శి, సచివాలయం సిబ్బంది పాల్గొని పంపిణీ కార్యక్రమాన్ని సమన్వయంగా నిర్వహించారు.

# చెరకు రైతుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

**- పరిశ్రమ-..ప్రభుత్వ సమన్వయంతో**

**సాగును లాభసాటిగా మార్చాలి**

**- ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి**



**నరసన్నపేట, జనవరి 31(వార్త):** విజయనగరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన చెరకు పరిశ్రమ సమీక్షా సమావేశంలో నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పాల్గొని, చెరకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కీలక అంశాలను లేవనెత్తారు. ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎం.ఎస్.ఎం.ఈ (మీవీజు) శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సహా ఉన్నతాధికారులు హాజరయ్యారు. స్వయంగా చెరకు రైతు కావడంతో క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మెల్యే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. గత నాలుగు సంవత్సరాల్లో విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో చెరకు సాగు దాదాపు 53 శాతం మేర తగ్గడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సాగు వ్యయం పెరగడం, కూలీల కొరత, పరిశ్రమల నిర్వీర్యత వంటి కారణాలు రైతులను చెరకు సాగు నుంచి దూరం చేస్తున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పలు ముఖ్య సూచనలు చేశారు. మూతపడిన చక్కెర కర్మాగారాలను పునరుద్ధరించి రైతులకు, కార్మికులకు భరోసా కల్పించాలని కోరారు. కూలీల కొరతను అధిగమించేందుకు తక్కువ ధరకే హార్వెస్టర్లను అందుబాటులోకి తేవాలని, విత్తన సబ్సిడీలను పెంచి ఎరువుల సరఫరాను పునరుద్ధరించాలని సూచించారు. అలాగే చెరకు రవాణా ఖర్చులు తగ్గేందుకు పొలాలకు వెళ్లే ఫీల్డ్ రోడ్ల అభివృద్ధి అత్యవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వం, చక్కెర కర్మాగారాల యాజమాన్యాలు, పరిశోధనా సంస్థలు సమన్వయంతో పనిచేస్తేనే చెరకు సాగును మళ్లీ లాభసాటిగా మార్చగలమని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు కొండ్రు మురళి, బేబీనాయన, జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తదితర ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కోతను పరామర్శించిన జనసేన నాయకులు



**పలాస, జనవరి 31(వార్త):** జనసేన పార్టీ నాయకులు కోత పూర్ణచంద్రరావు కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. పలాస నియోజకవర్గం శ్రీకాకుళం జిల్లా ముఖ్య నాయకులు పలాస మున్సిపల్ మాజీ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు మాతృమూర్తి కోత చిట్టమ్మ ఈ నెల 24న స్వర్గస్తులు అయినారు. మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న నేపథ్యంలో పలాస పట్టణంలో వారి నివాసనికి వెళ్లి స్వర్గీయ కోత చిట్టమ్మ పవిత్ర ఆత్మకు శాంతి చేరాలని, ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, పరామర్శించారు. ఈ పరామర్శిలో జనసేనపార్టీ ఉమ్మడి జనసేనపార్టీ రాష్ట్ర కార్యదర్శి,శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్, జనసేనపార్టీ జిల్లా ప్రధానకార్యదర్శిలు కూరాకుల యాదవ్, సంతోష్ పండా, జిల్లా సంయుక్త కార్యదర్శి చిట్టి భాస్కర్, జనసేనపార్టీ జిల్లా నాయకులు ముంగి జగదీష్, జనసేనపార్టీ నాయకులు, స్థానిక ఏఎంసీ డైరెక్టర్ లు బతకల భాస్కర్, కిల్లి బాలకృష్ణ, స్థానిక నీటిసంఘం అధ్యక్షులు పైల నాగార్జున్, జనసేనపార్టీ మండల అధ్యక్షులు కుప్పాయి గోపాల్, జనసేనపార్టీ నాయకులు రుంకు తరాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కళాశాల వార్షికోత్సవం




**కంచిలి, జనవరి 31(వార్త):** కంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ జగదీష్ కుమార్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన వార్షికోత్సవ దినోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కవిటి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సింహాచలం నాయుడు హాజరయ్యారు. విద్యార్థులను ఉద్దేశించి మీరు మాట్లాడారు. విద్యార్థి దశలో సమయం చాలా కీలకమైనదని పేర్కొన్నారు. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రతి సబ్జెక్టును అర్థం చేసుకుంటూ పరీక్షలలో మంచి ఫలితాల కోసం చిత్తశుద్ధితో చదవాలని కోరారు. భవిష్యత్తులో పోటీ పరీక్షలను సవాల్గా తీసుకొని ఇప్పటినుంచే ప్రణాళిక బద్ధంగా చదివి ఉన్నతమైన భవిష్యత్తు కోసం మంచి బాటలు వేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్పిఓ నరసింహ కుమార్ దాస్, పట్నాయక్ వాసుదేవ్ వేణుగోపాల్ కోదండరావ్ భువన్ కుమార్ పంకజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్జీయూకేటీలో 'జెన్ ఏఐ' శిక్షణ పూర్తి

**ఎచ్చెర్ల, జనవరి 31(వార్త):** విద్యార్థులు అకడమిక్ అంశాలతో పాటు పరిశ్రమలకు అవసరమైన ఆధునిక సాంకేతికతలపై పట్టు సాధించినప్పుడే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆర్జీయూకేటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కేవీజీడి బాలాజీ పేర్కొన్నారు. క్యాంపస్‌లోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'జెన్ ఏఐ ఎస్డీఎల్సీ' అంశంపై నిర్వహించిన రెండు రోజుల వర్క్‌షాప్ శనివారం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులు తమను తాము సిద్ధం చేసుకోవాలని, ఇలాంటి శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సారికి టెక్నాలజీస్ సీఈఓ ప్రసాద్ సారికి విద్యార్థులకు జెనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సాఫ్ట్‌వేర్ అభివృద్ధి దశలపై ప్రాయోగిక అవగాహన కల్పించారు. సుమారు 120 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో పరిశ్రమలో ఏఐ వినియోగం, వృత్తిపరమైన అవకాశాలను వివరించారు. సీఎస్ఈ విభాగాధిపతి కోడా దిలీప్ కుమార్ కన్వీనర్‌గా, డి. పద్మావతి సహ-కన్వీనర్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో డీన్ డా. ఎం. శివరామకృష్ణ, ఏఓ డా. ముని రామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ డా. వాసు, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాలకు అప్పలరాజుకు ఆహ్వానం



**మందస, జనవరి 31(వార్త):** మందసలోని శ్రీవాసుదేవ పెరుమాళుని బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి ఏడు నుంచి జరుగనున్నాయి. బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును శ్రీవాసుదేవసేవాసమితి ప్రతినిధులు ఆహ్వానించారు. ఈ మేరకు ఆహ్వాన పత్రికను అప్పలరాజుకు అందించి, బ్రహ్మోత్సవాల్లో పాల్గొని, స్వామి పూజలకు హాజరుకావాలని కోరారు. స్వామి తీర్థప్రసాదాలు స్వీకరించాలన్నారు. బ్రహ్మోత్సవాలకు తప్పక వస్తానని డాక్టర్ సీదిరి అప్పలరాజు చెప్పినట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు, వేదపండితులైన గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు, శానాపతి కిషోర్ కుమార్, కరతల తిరుపతి ఉన్నారు.

## మాఘశుద్ధ పౌర్ణమి సందర్భంగా పద్మనాభస్వామివారి ఆలయ గిరిప్రదక్షిణ

**జలుమూరు, జనవరి 31 (వార్త):** మాఘశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని, ఆదివారం నాడు శ్రీముఖలింగేశ్వరస్వామి వారి ఆలయ క్షేత్ర పాలకులు అయిన శ్రీపద్మనాభస్వామివారి ఆలయంలో గిరిప్రదక్షిణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ పవిత్ర కార్యక్రమం ఉదయం 9 గంటల నుండి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేయనున్నట్లు కమిటీ వెల్లడించింది. మాఘశుద్ధ పౌర్ణమి వంటి శుభదినంలో నిర్వహించనున్న ఈ గిరిప్రదక్షిణ కార్యక్రమం భక్తులకు ఆధ్యాత్మిక శాంతి, భక్తి పరవశాన్ని అందిస్తుందని ఆలయ అర్చకులు తెలిపారు.



## స్థలం ఆక్రమించారంటూ దళితుడి ఆవేదన



**జలుమూరు, జనవరి 31 (వార్త):** ప్రభుత్వం ఎస్సీ కేటగిరీ కింద ఇచ్చిన తన స్థలాన్ని ఆక్రమించారని అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకపోయిందంటూ జలుమూరు మండలం టెక్కలిపాడుకు చెందిన ఓ దళితుడు శనివారం మీడియా ఎదుట తన గోడును వెల్లడించాడు. వెంకటరమణ అనే వ్యక్తి మాట్లాడుతూ, తన తండ్రికి 1976లో ఎస్సీ కేటగిరీ కింద ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో తాము నివాసం ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. అయితే ఆ స్థలంలో మిగిలిన భాగాన్ని అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి అక్రమంగా ఆక్రమించుకున్నాడని ఆయన ఆరోపించారు. ఈ విషయమై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తానని పేర్కొన్న వెంకటరమణ, సోమవారం టెక్కలి సచివాలయం ఎదుట కుటుంబ సభ్యులతో కలిసి నిరాహార దీక్ష చేపడతానని ప్రకటించారు. తనకు న్యాయం చేయాలని, ప్రభుత్వం ఇచ్చిన భూమిని తిరిగి తనకు అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు.


## నరసన్నపేట సబ్ జైలు పరిశీలన



**నరసన్నపేట, జనవరి 31(వార్త):** నరసన్నపేట సబ్ జైలులో ఉన్న ముద్దాయిల కేసుల వివరాలను సివిల్ జడ్జి శ్రీమతి ఎస్. వాణి శనివారం పరిశీలించారు. సబ్ జైలుకు చేరుకున్న ఆమె, ప్రస్తుతం అక్కడ ఉన్న పదిమంది ముద్దాయిల వివరాలను తెలుసుకుని, వారి కేసుల స్థితిగతులపై విచారణ చేశారు. ఈ సందర్భంగా బెయిల్‌పై విడుదల కావడానికి న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేని ముద్దాయిలకు న్యాయాధికార సేవా సంస్థ (లీగల్ సర్వీసెస్ అథారిటీ) ద్వారా ఉచిత న్యాయ సహాయం అందించనున్నట్లు ఆమె తెలిపారు. న్యాయం ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో ఈ చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అలాగే ముద్దాయిల క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకున్న జడ్జి, జైలులో వారికి అందుతున్న సౌకర్యాలు, ఆరోగ్య పరిస్థితులపై కూడా ఆరా తీశారు. న్యాయ ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

## విద్యార్థుల జనరల్ నాలెడ్జ్‌పై ప్రత్యేక దృష్టి

జలుమూరు, జనవరి 31 (వార్త): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్‌పై ప్రాథమిక స్థాయి నుంచే అవగాహన కల్పించాలని మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ) బమ్మిడి మాధవరావు తెలిపారు. శనివారం జలుమూరు మోడల్ ఆదర్శ పాఠశాలను ఆయన సందర్శించి, బోధనా విధానాలు మరియు మౌలిక వసతులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేస్తూ, దేశాలు--వాటి రాజధానులు, నదులు, పర్వతాలు వంటి అంశాలపై విద్యార్థులకు క్రమబద్ధమైన అవగాహన కల్పించాలని సూచించారు. పాఠ్యాంశాలతో పాటు సాధారణ జ్ఞానం పెంపొందించే విధంగా బోధన సాగితే విద్యార్థుల ఆలోచనా శక్తి, పోటీ పరీక్షలకు అవసరమైన నైపుణ్యాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. అలాగే పాఠశాలలో మౌలిక వసతులు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని, మధ్యాహ్న భోజనం నాణ్యతతో పాటు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని ఎంఈఓ మాధవరావు పిలుపునిచ్చారు.



## బాధ్యతతో ..ఆప్యాయతగా పెన్షన్లు పంపిణీ



**పలాస జనవరి 31 (వార్త):** ప్రభుత్వ పథకాలను అమలు చేయడం ఒక బాధ్యత, వాటిని ప్రజల ముఖాల్లో చిరునవ్వులు పూయించేలా అందించడం ఒక గొప్ప అనుభూతి. సరిగ్గా ఇదే అనుభూతి శనివారం పలాసలో కనిపించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఎన్టీఆర్ భరోసా' పెన్షన్ల పంపిణీ కార్యక్రమం పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశాల మేరకు రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు స్వయంగా లబ్ధిదారుల వద్దకు వెళ్లి పెన్షన్లను అందజేశారు. ఈ ఫోటో... ఒక వెయ్యి మాటల సాక్ష్యం! పైన ఉన్న చిత్రాన్ని ఒక్కసారి గమనిస్తే... అక్కడ జరుగుతున్నది కేవలం ఆర్థిక సహాయం అందించడం మాత్రమే కాదని అర్థమవుతుంది. పెన్షన్ అందుకోవడానికి వచ్చిన ఒక వృద్ధురాలు, కన్నీటి పర్యంతమై చైర్మన్ వజ్జ బాబూరావుని హత్తుకున్న తీరు, దానికి ప్రతిగా ఆయన ఆమెను ఓదార్చిన దృశ్యం అక్కడున్న వారిని కదిలించింది. వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ఈ ప్రభుత్వం అండగా నిలుస్తుందనడానికి, ఇది మంచి ప్రభుత్వం అనే మాటకు ఈ చిత్రమే నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. నాయకుడు ప్రజలతో మమేకమైనప్పుడు ఇలాంటి హృదయపూర్వక దృశ్యాలు ఆవిష్కృతమవుతాయి. జనంలోకి... జనం కోసం! వజ్జ బాబూరావు, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులతో కలిసి వార్డుల్లో పర్యటించారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వారి చేతికే పెన్షన్ అందేలా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు గాలి కృష్ణారావు, 31వ వార్డు ఇంచార్జి కొరికాన శంకర్ రావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## బోర్డు బంగ్లా స్థలం అక్రమాలపై బగ్గుమన్నారు

**-మండల స్థాయి అధికారుల**

**నిర్లక్ష్యంపై ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి**




**నరసన్నపేట, జనవరి 31(వార్త):** బోర్డు బంగ్లా స్థలానికి సంబంధించిన అక్రమ కబ్జాల వ్యవహారంలో మండల స్థాయి అధికారుల నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యంపై నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి తీవ్రంగా మండిపడ్డారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో అధికారులు విఫలమవుతున్న తీరుపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమంగా ఆక్రమించిన బోర్డు బంగ్లా స్థలాన్ని వెంటనే ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, కబ్జాదారులపై ఉక్కు పాదం మోపాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన బాధ్యత అధికారులదేనని, అలసత్వం లేదా నిర్లక్ష్యం సహించబోమని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా కొందరు అధికారుల ప్రవర్తనపై కూడా ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆయన సూచించారు. ఈ విషయాన్ని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ వాణిజ్య విభాగ కార్యదర్శి జామి వెంకట్రావ వెల్లడించారు.

## రెవెన్యూ విధులను పకడ్బందీగా నిర్వహించాలి

**-భూ రికార్డులు సక్రమంగా ఉండాలి**

**-అదనపు ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్**

**జి.సిగడాం, జనవరి 31(వార్త):** రెవెన్యూ సేవల్లో వేగం పెంచాలని నిర్దేశించిన గడువులోపు పనులను పూర్తి చేయాలని అదనపు ట్రైనీ కలెక్టర్ డోనాక పృథ్వీరాజ్ కుమార్ అన్నారు. శనివారం ఆయన జి.సిగడాం మండలంలో పర్యటించారు.జాడలో జరుగుతున్న రీ- సర్వే, మండల కేంద్రంలో రేషన్ చౌక దుకాణ డిపో-1 లను ఆయన పరిశీలించారు. పక్కాగా రీ-సర్వే నిర్వహించాలన్నారు. రీ-సర్వే సమయంలో రైతులకు పక్కా తెలియజేసి వారి సమక్షంలో భూములకు సంబందించిన వివరాలను నమోదు చేయాలన్నారు. సక్రమంగా లేని వాటిని ఉన్నత అదికారుల దృష్టిలో పెట్టి గ్రామ పెద్దల, అదికారుల సమక్షంలో సరిచేయాలన్నారు. రేషన్ దుకాణాలలో తూకవలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పని వేళల్లో రేషన్ దుఖానాలు తెరిచి ఉంచాలని, సరుకులు వివరాల బోర్డులును ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో పలు రికార్డులను ఆయన పరిశీలించారు. పీజీఆర్ఎస్, ఇతర ఆర్జీలను వెంట వెంటనే పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఎటువంటి ఆర్జీలు పెండింగ్లో ఉప చరాదన్నారు. గ్రామాలలో రైతులకు అందుబాటులో ఉంటూ వారికి మెరుగైన సేవలు అందించాలన్నారు. క్రయ, విక్రయాల వివరాలు ఎప్పటికప్పుడు రెవెన్యూ రికార్డులలో పొందు పరచాలన్నారు.భూ శుద్ధీకరణ సమయంలో జరిగిన తప్పులు సరి చేసే ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. నీటిపారుదల శాఖ అధికారులు సర్వే రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకుంటూ చెరువుల ఎఫ్టిఎల్, బఫర్ జోన్ పరిధి నిర్ధారించాలని ఆదేశించారు. చెరువు భూములలో ఆక్రమణలు ఎక్కడైనా జరిగితే వెంటనే రికవరీ చేయాలని అన్నారు. ఈయన వెంట తహసీల్దార్ ఎం సరిత, డీటీ ఎన్ నిర్మల, రీ-సర్వే డీటీ, కె గాయిత్రి, ఆర్ ఐ రాధ, మండల సర్వేయర్ శాంతారాం, విఆర్వో భూపతి నర్సింగరావు,పోట్నూరు జగన్నాథరావు సచివాలయ సర్వేయర్లు, విర్వోలు, సిబ్బంది ఉన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# 19 మంది ఎస్ఐలకు..

# ట్రాన్స్‌ఫర్






* ఉత్తర్వులు జారీ చేసిన ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, జనవరి 31 (వార్త): జిల్లాలో 19 మంది ఎస్ఐలకు బదిలీ చేస్తూ ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. చాలా మంది వీఆర్‌లో ఉండగా వారికి ఆయా పోలీస్‌స్టేషన్లను కేటాయించగా, మరికొందరికి ఒక స్టేషన్ నుంచి మరో స్టేషన్‌కు బదిలీ అయింది. శ్రీకాకుళం జిల్లా నుంచి ఎస్ఐలకు బదిలీ అంటే వీఆర్ అనే మాట వినిపించేది. ఈసారి దీనికి భిన్నంగా బదిలీలు జరిగాయి. శ్రీకాకుళం టూటౌన్ (లాఅండ్ ఆర్డర్-1) ఎస్ఐగా జి.సిగడాం ఎస్ఐ వై.మధుసూదనరావును, శ్రీకాకుళం టూటౌన్ (లాఅండ్ ఆర్డర్-2) ఎస్ఐగా మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్ఐ కె.లక్ష్మీని, శ్రీకాకుళం మహిళా పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా బి.లావణ్యను బదిలీ చేశారు. జి.సిగడాం స్టేషన్‌కు ఎచ్చెర్ల ఎస్ఐ వి.సందీప్‌కుమార్‌ను , ఎచ్చెర్ల ఎస్ఐగా లావేరు ఎస్ఐ జి.లక్ష్మణరావును బదిలీ చేయగా, వీఆర్‌లో ఉన్న కె.అప్పలసూరిని లావేరు ఎస్ఐగా నియమించారు. వి.హేమంత్ కళ్యాణ్‌ను హిరమండలం ఎస్ఐగా, బి.మోహినిని సోంపేట ఎస్ఐగా, బి.గణేష్‌ను నరసన్నపేట ఎస్ఐగా నియమించారు. ఇక కొత్తూరు ఎస్ఐగా కె.వెంకటేష్, ఇచ్ఛాపురం రూరల్ ఎస్ఐగా ఆర్.జనార్ధనరావు, ఇచ్ఛాపురం టౌన్ ఎస్ఐగా ఎం.ముకుందరావు, ఆమదాలవలస ఎస్ఐగా ఎస్.బాలరాజు, సరుబుజ్జిలి ఎస్ఐగా బి.హైమావతి, పాతపట్నం ఎస్ఐగా కె.మధుసూదనరావు, కాశీబుగ్గ ఎస్ఐ2గా ఆర్.నరసింహమూర్తి, సంతబొమ్మాళి ఎస్ఐగా వై.సింహాచలం, కంచిలి ఎస్‌గా పి.పారినాయుడు, కవిటి ఎస్ఐగా ఎస్.రవివర్మను నియమిస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలి

**పలాస, జనవరి 31(వార్త):** ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేటట్లు చూడవలసిన బాధ్యత మనందరిపై ఉందని పలాస న్యాయ సేవ సంఘం, జూనియర్ సివిల్ జడ్జి యు మాధురి అన్నారు. వీధి బాలల దినోత్సవం సందర్భంగా శనివారం పలాస కోర్టు ఆవరణంలో కార్మికులతో కలిసి ప్రత్యేక న్యాయ విజ్ఞాన సదస్సు మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షులు, జూనియర్ సివిల్ జడ్జి యు. మాధురి నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ 14 సంవత్సరాల పిల్లలందరూ బడిలో ఉండాలని, ఏపిల్లలు కూడా వీధి బాలలుగా ఉండకూడదని, ప్రతి ఒక్కరికి ఆశ్రయము, పౌష్టికాహారం అందే విధంగా సమాజంలో ప్రతి ఒక్కరు చూడాలని, పేదరికం లేదా ఇతర కారణాలవల్ల బాలలను వీధులు పాలు చేయరాదని ఆమె తెలియజేశారు. అంతేకాకుండా అటువంటి బాలలను మండల లీగల్ సెల్ సర్వీస్ అధారిటీ వారి దగ్గర తీసుకొస్తే తగు విధంగా వారికి సహాయం చేయగలమని జూనియర్ సివిల్ జడ్జి తెలియజేసారు.

ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నమెంట్ లీడర్ పిండి వెంకట్రావు, బార్ ఉపాధ్యక్షుడు బికేఆర్ పట్నాయక్, జాయింట్ సెక్రెటరీ జిఎంఎస్. అనిల్ రాజు, కోత. రజిని కుమార్, లోకేశ్వరరావు, విజ్ఞేశ్వర రావు, శ్యామ్ సుందర్ రావు, బి రవికుమార్, సిహెచ్ శ్రీనివాసరావు, లేబర్ యూనియన్ నాయకులు అంబటి కృష్ణమూర్తి, పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.



# రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

### -కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**శ్రీకాకుళం, జనవరి 31(వార్త):** రోడ్డు భద్రత అనేది కేవలం ఒక నెలకే పరిమితం కాకుండా సంవత్సరమంతా పాటించాల్సిన సామూహిక బాధ్యత అని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు.

శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల ముగింపు కార్యక్రమం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఉప రవాణా కమిషనర్ విజయ సారథి అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రహదారి నిబంధనలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, క్రమశిక్షణతో వాహనాలు నడపడం ద్వారానే ప్రమాదాల నివారణ సాధ్యమని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రవాణా శాఖ నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు విజయవంతమయ్యాయని, సిబ్బంది కృషి అభినందనీయమని కొనియాడారు. మాసోత్సవాల సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పెదపాడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకులం విద్యార్థినులు ప్రతిభ చాటారు. ఎస్. సోని (8వ తరగతి) ప్రథమ బహుమతి సాధించగా, బి. ధనలక్ష్మి (9వ తరగతి) ద్వితీయ, బి. హాసిని (9వ తరగతి) తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. విజేతలకు కలెక్టర్ బహుమతులు అందజేసి అభినందించారు. ఈ నెల రోజుల పాటు క్షేత్రస్థాయిలో కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిన రవాణా శాఖ అధికారులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

ఆర్.టి.ఒ ఆర్. అనిల్, మోటార్ వాహన తనిఖీ అధికారులు (ఎం.వి.ఐ) గంగాధర్, కె. శిరీష, ఎస్. శిరీష, జి. శ్రీధర్, డి. సంజీవరావు, ఆర్. గోవిందరాజు, వై. శ్రీనివాస్ ఇతర సిబ్బందిని వారి నిబద్ధతకు గాను అభినందనలు తెలిపారు.

రాబోయే రోజుల్లోనూ రోడ్డు భద్రతా చర్యలను మరింత బలోపేతం చేస్తూ, సురక్షిత ప్రయాణం లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు.

## చంద్రబాబు సంక్షేమ ముద్ర..ముందే పెన్షన్ల పంపిణీ



**పలాస, జనవరి 31 (వార్త):** లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదనే ఉద్దేశంతో ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారం కావడంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందస్తుగానే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీని చేపట్టింది. సంక్షేమమే ప్రథమ లక్ష్యంగా ప్రజా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మానవీయ ఆలోచనలకు ఇది స్పష్టమైన నిదర్శనమని టిడిపి నాయకులు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ కార్యక్రమాన్ని పలాస నియోజవర్గ శాసన సభ్యురాలు గౌతు శిరీష ఆదేశాల మేరకు రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు, వజ్రపుకొత్తూరు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కర్ని రమణ పింఛన్లు శనివారం పంపిణీ చేశారు. వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురం గ్రామ పంచాయతీ పరిధిలోని గోవిందపురం, గునాలపాడు, సీతంపేట తదితర గ్రామాల్లో సచివాలయం సిబ్బంది, కూటమి నాయకులతో కలిసి వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు పంపిణీ చేశారు. ప్రభుత్వం నేరుగా తమ ఇంటి వద్దకే వచ్చి పెన్షన్ అందించడం పేదలకు పెద్ద భరోసాగా మారిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే చంద్రబాబు నాయుడు పాలనలో ప్రధాన అజెండా. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ప్రజలకు ఆర్థిక స్థిరత్వాన్ని కల్పిస్తున్నాయి. ప్రభుత్వం ప్రజల అవసరాలను ముందుగానే గుర్తించి చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సత్యం, వార్డు మెంబర్ గణేష్, సింహాచలం కో--ఆప్షన్ సభ్యులు విఘ్నేష్, శంకర్, ఎస్ఎంసి చైర్మన్ శ్రీను, సీనియర్ నేతలు మోహనరావు, చంద్రయ్య, రామచంద్ర, తుంబనాథం, నారాయణతో పాటు కృష్ణార్జున యువ సైన్యం సభ్యులు నరేష్, సారథి, ప్రసాద్ పాల్గొన్నారు.


## ప్రమాద స్థితిలో బడి గోడ

### -కూలితే వందలాది మంది విద్యార్థుల ప్రాణాలు హారీ
### -గతేడాది సమస్యని రాజాం సురేష్ హెచ్ఎం దృష్టిలో పెట్టినా ప్రయోజనం శూన్యం
### -పురమిత్రలో ఫిర్యాదు
### -చోద్యం చూస్తున్న అధికారులు
### -సమస్య ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లాం : హెచ్ఎం




**పలాస, జనవరి 31 (వార్త):** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ఉదయపురం ఎం.పి.యు.పి స్కూల్ పరిస్థితులు నానాటికి ఆందోళనకరంగా మారాయి. ఉదయపురం ఎం.పి.యు.పి స్కూల్ ఉత్తరన పాడుబడిన ప్లారి గోడ సగం వాలిపోయున్నది, పిల్లల ఆటపాటల సందర్భాల్లో ఏ క్షణనైనా గోడ కుప్పకూలే పరిస్థితి కనిపిస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. దక్షిణానికి పూర్తిగా గోడ లేక హద్దులు వేసి కంచి కట్టి చేతులు దులేపేసుకున్నారని విమర్శలు గుప్పిస్తున్నారు. దక్షిణానికి గోడ నిర్మించకపోవడం కంచి మధ్య నుండి జంతువులు స్కూల్లోకి ప్రవేశిస్తున్నాయి. ఎం.పి.యు.పి స్కూల్లో ఒకటవ తరగతి నుండి ఐదవ తరగతి వరకు 163 మంది పిల్లలు వరకు విద్యాభ్యాస్తున్నారు. పిల్లల ఆటపాటల పలు సందర్భాల్లో వాలి ఉన్న పురాతన ప్లారి గోడ కూలీతే జరగరాని నష్టం జరిగితే జరిగే నష్టాన్ని వెనుక్కి తీసుకురాగలరా అంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చెస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే నూతన గోడ నిర్మాణనికి అవసరమైన పనులు చెపట్టి విద్యార్థులకు ప్రాణ రక్షణ కల్పిస్తారని విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు స్థానిక ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై గతంలో ఎం.పి.యు.పి స్కూల్ హెచ్.ఎం పి.వి రమణకు గత 4 నేలల ముందు వివరణ కోరగా ఉన్నత అధికారులకి తెలియజేశామని చెప్పారు. ఇప్పటికి అదే మాట చెబుతున్నారు. కాశీబుగ్గ చిన్న తిరుపతి దేవస్థానం వద్ద జరిగిన ప్రమాదంలో 9 మంది వరకు దుర్మారణం చెందిన ఘటన లాంటి సంఘటన ఉదయపురం స్కూల్లో ప్రమాదం సంబవించే అవకాశాలు ఉన్నప్పటికీ అధికారులు చోద్యం చూస్తు ప్రమాదాలకు అవకాశలిస్తున్నారని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు సమస్య పరిస్కారిస్తారని ప్రజలు కోరుతున్నారు.

## బల్ల దంపతులకు శుభాకాంక్షల వెల్లువ



**పలాస, జనవరి 31 (వార్త):** వైయస్ఆర్సీపీ సీనియర్ నేత, పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు - ఉష దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా శనివారం పలాస నియోజకవర్గ నలుమూలల నుంచి పలువురు ప్రముఖులు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. గిరిబాబు అత్యంత సన్నిహితులు వివాహ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి సీనియర్ నేత మద్దు రాంప్రసాద్ మాట్లాడుతూ చైర్మన్ బల్ల గిరిబాబు ఎప్పుడు ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేస్తూ, తన సేవా తత్వంతో అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని, ఆయన సతీమణి బల్ల ఉషారాణి మున్సిపల్ కౌన్సిలర్ గా కొంతకాలం సేవలు అందించారని, ప్రస్తుతం లైన్స్ క్లబ్ మహిళా విభాగం తరపున పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ, మానవతా భావంతో ప్రతి ఒక్కరి గుండెల్లో ప్రత్యేక స్థానం పొందారని, ఈ జంట సమాజానికి స్ఫూర్తిగా నిలిచింది అన్నారు. కార్యక్రమంలో డబ్బీరు నాగు, బడగల మధు, చక్రి,ప్రసాదు, మురళి పాల్గొన్నారు.

## బరంపురం జట్టుపై రంభ జట్టు విజయం

**ఇచ్ఛాపురం, జనవరి 31 (వార్త):** సురంగి రాజా మైదానంలో ప్రారంభమైన వెచ్చా జయంతి మెమోరియల్ టీ20 క్రికెట్ టోర్నీ పోటీలో భాగంగాఉల్లాసంగా ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. శనివారం మొదటి మ్యాచ్లో ఓడిశా కి చెందిన బరంపురం లీడ్స్ అకాడమి జట్టు. రంభ జట్లు తలపడ్డాయి. ట్యాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న రంభ జట్టు నిర్ణీత 19.3 ఓవర్లులో 192 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. అనంతరం 193 పరుగుల విజయలక్ష్యంతో బరిలో కి దిగిన బరంపురం జట్టు 20ఓవర్లులో 154పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. 93 పరుగులు చేసిన సంతోష్ కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ట్రోఫీని ప్రముఖ వ్యాపార వేత్త వెచ్చా కేశవరావు, కాళ్ల దిలీప్, బి కృష్ణయ్య లు నగదుతో పాటు షీల్డ్ ను అందజేశారు.



# చురుగ్గా బీటీ రోడ్డు పనులు

### -రూ.2.75 కోట్లతో 6.4 కి.మీ. మేర నిర్మాణం -జాతీయ వార్త కథనానికి స్పందన




**జి.సిగడాం, జనవరి 31 (వార్త):** ఇటీవల ఈనెల 26న జాతీయ వార్త పత్రికలో రోడ్డుపై అడుగుకొక గుంత గజానికి ఒక గొయ్యి అనే శీర్షిక పేరిట ప్రచురితమైన పాఠకులకు తెలిసిన విషయమే ... చిలకపాలేం- రామభద్రపురం బీటీ రహదారి నిర్మాణ పనులు శనివారం ప్రారంబించారు. మండలం వాండ్రంగి రైల్వే బ్రిడ్జి నుంచి గేదెలపేట కూడలి వరకు 6.4 కిలో మీటర్ల పొడువున సుమారు 2 కోట్ల75 లక్షల వ్యయంతో రాజాం- చిలకపాలేం ప్రధాన రహదారి పనులు చేపడుతున్నట్లు డీఈ గణపతిరావు తెలిపారు ఏఈ పిటి రాజు మాట్లాడుతూ ప్రదాన రహదారి గేదేల పేట జంక్షన్ నుండి పొందురూ రైల్వే బ్రిజ్జి వరకు ఈ పనులను నిర్వహిస్తున్నమన్నారు. ఆనంతరం రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. రెండు మూడు రోజులల్లో ఈ రహదారి నిర్మాణ పనులు పూర్తి చేయనున్నట్లు వారు తెలిపారు. ఈ రహదారి నిర్మాణ పనులతో ప్రయాణీకులు అవస్థలు తీరనున్నాయని అన్నారు.

# తిరుమల లడ్డూ అపవిత్రం చేసి నీతులా?

### -వైసీపీ పాలనలో కల్తీ పరాకాష్టకు చేరింది -- - కళింగ వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు

**నరసన్నపేట, జనవరి 31(వార్త):** కలియుగ ప్రత్యక్ష దైవంగా భావించే తిరుమల తిరుపతి దేవస్థానంలో భక్తులకు ప్రసాదించే పవిత్ర లడ్డూను గత వైసీపీ ప్రభుత్వ పాలకులు కల్తీ నెయ్యితో అపవిత్రం చేసి భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కళింగ వెల్ఫేర్ మరియు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణన్నాయుడు తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఈ అంశంపై భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు దర్యాప్తు సంస్థను నియమించి విచారణ జరిపి, నివేదికలో కల్తీ జరిగినట్లు స్పష్టంగా వెల్లడించినప్పటికీ, నేటికీ వైసీపీ పార్టీ నాయకులు ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి వికృత ప్రచారాలు వారి మానసిక స్థితిని స్పష్టంగా ప్రతిబింబిస్తున్నాయని వ్యాఖ్యానించారు. పాలు లేకుండానే నెయ్యి తయారు చేసే “కొత్త సైన్స్”ను, “కొత్త విజ్ఞానాన్ని” ప్రపంచానికి పరిచయం చేసిన ఘనత వైసీపీ నాయకులకే దక్కుతుందని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు నివేదిక వచ్చిన తర్వాత కూడా సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారం చేయడం వారి వికృత చేష్టలు పరాకాష్టకు చేరినదానికి నిదర్శనమని అన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో కల్తీ కానిది ఏదైనా ఉందా? అని ప్రశ్నించిన ఆయన, రాష్ట్రంలో ప్రతి రంగం కల్తీతో నిండిపోయిందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తిరుమల వంటి పవిత్ర క్షేత్రాన్ని కూడా రాజకీయ లాభాల కోసం అపవిత్రం చేయడం అత్యంత దురదృష్టకరమని, దీనిపై ప్రజలు తగిన తీర్పు ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు.



# ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పేదలకు వరం

### -ఇంటింటికీ పంపిణీకి కట్టుబడిన ప్రభుత్వం
### -ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

**నరసన్నపేట, జనవరి 31(వార్త):** ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికీ ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఇంటింటికీ అందిస్తున్నామని నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి తెలిపారు. శనివారం నాడు నరసన్నపేట పట్టణంలోని హడ్కోకాలనీ ప్రాంతంలో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన స్థానిక కూటమి నాయకులతో కలిసి పాల్గొని, లబ్ధిదారులకు స్వయంగా పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా నిరుపేదలు, నిరాశ్రయులకు ఆర్థిక భరోసా లభిస్తోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టిన అనంతరం పింఛన్ మొత్తాన్ని రూ.3,000 నుంచి రూ.4,000కు పెంచడం పట్ల లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. అలాగే నెల మొదటి తేదీ సెలవు కావడంతో, లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా 31వ తేదీననే పింఛన్లు అందజేయడం ప్రభుత్వం పేదల పట్ల చూపుతున్న కట్టుబాటుకు నిదర్శనమని అన్నారు. నూరు శాతం పింఛన్ల పంపిణీ సాధించేందుకు సంబంధిత సచివాలయ సిబ్బంది మరింత చిత్తశుద్ధితో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ, అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎలాంటి ఆలస్యం లేకుండా పింఛన్లను ఇంటింటికీ పంపిణీ చేస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ చైర్మన్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు, రాష్ట్ర--జిల్లా--మండల--పట్టణ కూటమి నాయకులు, కార్యకర్తలు, యువత తదితరులు పాల్గొన్నారు.



## చీడిపూడిలో ఘనంగా వేంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాలు



**సారవకోట, జనవరి 31 (వార్త):** చీడిపూడిలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో కళ్యాణ మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుగుతున్నాయి. మూడు రోజులుగా కొనసాగుతున్న ఈ ప్రత్యేక పూజా కార్యక్రమాలు పౌర్ణమి రోజున ముగుస్తాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కళ్యాణ మహోత్సవాల అనంతరం స్వామివారి చక్కర తీర్థశాన్నం నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు. ఈ పవిత్ర కార్యక్రమంలో చీడిపూడి, అవలింగి, బుడితి గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించనున్నారని తెలిపారు. ఈ ఉత్సవాలు గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత ఉట్టిపడేలా చేస్తున్నాయని భక్తులు పేర్కొంటూ, స్వామివారి ఆశీస్సులతో ప్రజలందరికీ శుభఫలితాలు కలగాలని ఆకాంక్షించారు.

## సారవకోట జెడ్పీ హైస్కూల్ను పరిశీలించిన డీఈవో



**సారవకోట, జనవరి 31(వార్త):** సారవకోట జిల్లా పరిషత్ హై స్కూల్ను జిల్లా విద్యా శాఖ అధికారి (డీఈఓ) రవికుమార్ శనివారం పరిశీలించారు. మరికొద్ది రోజుల్లో 10వ తరగతి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో, విద్యార్థుల సిద్ధత, సామర్థ్య అభ్యాసనపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. ఈ సందర్భంగా డీఈఓ విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి, పాఠ్యాంశాలపై అవగాహన, పరీక్షల కోసం తీసుకుంటున్న అభ్యాస చర్యలపై ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థి శతశాతం మార్కులు సాధించేలా కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల బలహీనతలను గుర్తించి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఆయన తెలిపారు. ఈ తనిఖీలో మండల విద్యాశాఖ అధికారి మద్దు వెంకటరమణ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు పరీక్షలు కీలకమైనవని పేర్కొన్న డీఈఓ, నాణ్యమైన బోధనతో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులకు సూచనలు చేశారు.

## ఉద్యోగ విరమణ పొందిన పోలీసులకు ఘన సత్కారం

**శ్రీకాకుళం, జనవరి 31 (వార్త):** శ్రీకాకుళం జిల్లా పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం విధినిర్వాహణలు నిర్వహించి, నిష్ఠతో సేవలందించిన ఎం. వెంకటరావు (ఎస్సై మహిళ పోలీసు స్టేషన్), ఎన్. నాగేశ్వర రావు (ఏఆర్ ఎస్సై ఆర్మ్డ్ రిజర్వ్ విభాగం), జె. శంకర్ రావు (పోలీసు కానిస్టేబుల్ కొత్తూరు పోలీసు స్టేషన్) శనివారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఉద్యోగ విరమణ వీడ్కోలు కార్యక్రమంలో అదనపు ఎస్పీ కేవీ రమణ గారు, ఉద్యోగ విరమణ పొందిన ముగ్గురు పోలీస్ సిబ్బందిని శాలువాలు, పూలమాలలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేసి ఘనంగా అభినందించారు. అదనపు ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ శాఖలో విధులు నిర్వహించడం కేవలం ఉద్యోగం కాకుండా ఒక సేవాభావమని, ప్రజల భద్రత కోసం వారు అందించిన సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. వారి అనుభవం, క్రమశిక్షణ, నిబద్ధత యువ పోలీస్ సిబ్బందికి ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం వారు ఆరోగ్యంగా, కుటుంబ సభ్యులు తో ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏ.వో సి.హెచ్.గోపినాథ్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్.కృష్ణంనాయుడు, పోలీస్ అసోసియేషన్ ట్రెజరర్ భుజంగరావు, కార్యవర్గ సభ్యులు జగదంబ, పోలీసు సిబ్బంది పాల్గొని ఉద్యోగ విరమణ పొందిన సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546